# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **'ఫిట్ ఇండియా' స్ఫూర్తితో 'ఫిట్ శ్రీకాకుళం' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమాయత్తం కావాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.**

3. **రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

4. **రాష్ట్ర ఆర్థిక పురోగతికి  అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.**

==========================

పర్యావరణ పరిరక్షణలో బాగంగా రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖ అధికారులతో నిన్న నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. త్వరలో చేపట్టే 2 కోట్ల 50 లక్షల విత్తన బంతుల పంపిణీ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. వచ్చే నెలలో విత్తన బంతులను సిద్ధం చేసి.. జూలై, ఆగస్ట్ నెలల్లో పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగుల నుంచి స్వచ్ఛంధ సంస్థల వరకు అందరినీ భాగస్వాముల్ని చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

--------------------------

'ఫిట్ ఇండియా' స్ఫూర్తితో 'ఫిట్ శ్రీకాకుళం' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమాయత్తం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ఎర్రన్న క్రీడా ఉత్సవం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని  శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్న ఎంపీ కప్--2026 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన నిన్న ప్రారంభించారు. అంతకుముందు టోర్నీ లోగోను ఆవిష్కరించిన మంత్రి, యువత పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొనాలని కోరారు. టోర్నీ ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించిన స్నేహపూర్వక

మ్యాచ్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, శాసన సభ్యులు జి.శంకర్, తదితరులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇందుకు అటవీశాఖ, పర్యాటకశాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అద్భుతమైన సందర్శనీయ ప్రాంతాలను గుర్తించేందుకు సంబంధిత శాఖల అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సుమారు 2 వందల పర్యాటక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఉన్న సౌకర్యాలు, వసతులు, అభివృద్ధి అవకాశాలపై సమగ్ర వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఐదు రోజుల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను కోరారు. పర్యాటకుల భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే పర్యాటకులకు పూర్తి రక్షణ కల్పించేందుకు 'పర్యాటక పోలీసు' వ్యవస్థను తీసుకురావాలని ప్రతిపాదించారు.

-----------------------------

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. నూతన ఇసుక పాలసీతో ఇసుకను ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. అనంతపురము జిల్లాలో 3 లక్షల టన్నుల ఇసుకను ప్రజలకు అందించామని మంత్రి పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

-----------------------------

రాష్ట్ర ఆర్థిక పురోగతిని పరుగులు పెట్టించేందుకు, ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. హైదరాబాదులోని సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు కృషి చేయాలన్నారు. అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలని ఆదేశించారు.

-----------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు అమరావతి క్యాంపు ఆఫీసు నుంచి బయలుదేరి చిత్తూరు జిల్లాలోని యాదమర్రి మండలం కంద్రిగ గ్రామంలోని

ప్రజా వేదికలో పాల్గొంటారు. అనంతరం సంతగేటు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకుంటారు. మధ్యాహ్నం టిడిపి కార్యకర్తల సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం అమరావతికి చేరుకుంటారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు చేరుకొని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం పట్టణంలో వేద పాఠశాల నిర్మాణంతో పాటు, ఆలయాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో ఈ రోజు సాయంత్రం మంత్రివర్గ సమావేశం జరగనుంది. వచ్చే నెల 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నూతన సంక్షేమ కార్యక్రమాలు, పథకాల ప్రారంభంపై మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. పలు ఇతర అంశాలపైనా ఈ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134 వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారమవుతుందని 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. అనంతరం దినకర్ పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఈ రోజు 13 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 2 వందల 21 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలవరం, కాకినాడ, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, ఎస్పిఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 46 నుంచి 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు రావద్దని సూచించారు.

=====================